ఈ ఏడాది నుంచే.. తరగతులు



జోగులాంబ గద్వాల ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

- నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ అనుమతులు
- 50 మంది చొప్పున అడ్మిషన్లు
- రెండు జిల్లాల్లో దాదాపు పూర్తయిన భవనాల నిర్మాణం
- పూర్తి స్థాయిలో లేని సిబ్బంది

నారాయణపేట/గద్వాల న్యూటౌన్, ఆగస్టు 2: జోగులాంబ గద్వాల, నారాయణపేట జిల్లాల్లో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ(నేషనల్ మెడికల్ కౌన్సిల్) నుంచి అనుమతులు వచ్చాయి. ఇక ఈ ఏడాది నుంచే ఎంబీబీఎస్ అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. మొదటి దఫాలో 50 మందికి ప్రవేశం కల్పించనున్నారు. రెండు జిల్లాల్లోనూ తనిఖీ సమయంలో సరైన సౌకర్యాలు, సిబ్బంది లేరని ఎన్ఎంసీ బృందం అనుమతులు నిరాకరించింది. తర్వాత వర్చువల్ ద్వారా సౌకర్యాలను పరిశీలించి అనుమతులు జారీ చేసింది.

జూన్ 24న ఎన్ఎంసీ బృందం తనిఖీ

జోగులాంబ గద్వాల జిల్లాలోని మెడికల్ కళాశాలను ఎన్ఎంసీ బృందం గత జూన్ 24న పరిశీలించింది. కొన్ని సదుపాయాలు, డాక్టర్ల కొరత ఉన్నదని రిజెక్ట్ చేసిన విషయం తెలిసిందే. తర్వాత ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కలెక్టర్ బీఎం సంతోష్ చొరవ తీసుకుని, గత జూలై 25న వర్చువల్ సమావేశాన్ని నిర్వహించారు. మెడికల్ కళాశాల భవనం, ఆస్పత్రిలో తగినంత ఓపీ ఉండటంతో పాటు అన్ని మౌలిక వసతులు చూపించడంతో ఎన్ఎంసీ బృందం కళాశాలకు అనుమతులు ఇచ్చింది. తరగతుల ప్రారంభం నాటికి మెడికల్ కళాశాలలో ఎలాంటి పనులు పెండింగ్ లేకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నారు.

సిబ్బంది కొరత..

మెడికల్ కళాశాలలో సిబ్బంది కొరత ఉంది. అడ్మిషన్లు ప్రారంభం అయ్యే నాటికి పూర్తి స్థాయిలో సిబ్బంది ఉండేలా ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ప్రొఫెసర్లు ఏడుగురు, అసోసియేట్ ప్రొఫెసర్లు తొమ్మిది మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 12 మంది, డీఎంఈ సిబ్బంది 79 మంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది 24 మంది, సీనియర్ రెసిడెన్సిలు ఎనిమిది మంది, ట్యూటర్లు ఆరు మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. నాల్గో తరగతి ఉద్యోగులతో పాటు మరికొంత మంది సిబ్బంది రావాల్సి ఉంది.

ఎన్ఎంసీ ప్రకారం ఏర్పాట్లు పూర్తి

జోగులాంబ గద్వాల జిల్లాలో నూతనంగా ఏర్పాటు అయిన మెడికల్ కళాశాలలో ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు డాక్టర్లు, సిబ్బంది నియామకం అయ్యారు. కళాశాల భవనం దాదాపుగా పూర్తయ్యింది. ఈ ఏడాది మొదటగా 50 మంది విద్యార్థులతో తరగతులు ప్రారంభం కానున్నాయి.

- డాక్టర్ పార్వతి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

పొరపాట్లు సరిదిద్దుకుని..

నారాయణపేట మెడికల్ కళాశాలకు అనుమతి విషయంలోనూ ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వం జాతీయ వైద్య కమిషన్‌కి అప్పీల్ చేసింది. గత జూన్‌లో తనిఖీకి వచ్చిన ఎన్ఎంసీ బృందం సభ్యులు కాలేజీలో లోటుపాట్లు ఉన్నాయని, అనుమతి ఇవ్వబోమని చెప్పింది. ప్రధానంగా అధ్యాపకులు లేరని, సీటీ స్కాన్ లేదని చెప్పారు. దాంతో తమకు మరో అవకాశం ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్ జూలై తొలి వారంలో ఎన్ఎంసీ లేఖ పంపించారు. ప్రభుత్వం నుంచి అప్పీల్ చేశారు. వర్చువల్ తనిఖీ సమయంలో రెండు పర్యాయాలు లోటుపాట్లు సరిచేసుకున్నారు. అందులో భాగంగా 109 మంది అధ్యాపకులను నియమించేందుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సీటీ స్కాన్‌ను సమకుర్చారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్ ప్రత్యేక చొరవ తీసుకొని కళాశాలలో సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకొన్నారు. ఎన్ఎంసీ అనుమతితో ఈ ఏడాది కౌన్సెలింగ్ ద్వారా 50 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పించనున్నారు. విద్యార్థులకు హాస్టల్ కోసం భవనాన్ని అద్దెకు తీసుకున్నారు.

అప్పక్‌పల్లి దగ్గర మెడికల్ కళాశాల



నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనం

నారాయణపేట మండలం అప్పక్‌పల్లి దగ్గర జిల్లా ఆస్పత్రితో పాటు మెడికల్ కళాశాలను అన్ని హంగులతో నిర్మిస్తున్నారు. పనులు పూర్తి దశకు వచ్చాయి. ఇది వరకు ఉన్న 100 పడకల జిల్లా ఆస్పత్రి 250 పడకలకు అప్‌గ్రేడ్ అయ్యి, జనరల్ ఆస్పత్రిగా మారింది. తాత్కాలికంగా పాత జిల్లా ఆస్పత్రి భవనం పైఅంతస్తులో మెడికల్ కళాశాల విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిర్వహించనుండగా, అప్పక్‌పల్లి దగ్గర ఉన్న జిల్లా ఆస్పత్రి పైఅంతస్తులో తరగతులను నిర్వహించనున్నారు. మొత్తం 433 పోస్టులు మంజూరు కాగా, ఇప్పటికే 105 మంది స్టాఫ్ నర్సులు విధుల్లో చేరారు. ఇప్పుడు అందుతున్న వైద్యసేవలతో పాటు ఈఎన్‌టీ, ఆప్తాల్మిక్, డెర్మాటలజీ, సైకాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయోలజీ తదితర అన్ని విభాగాల సేవలు అందనుండటం జిల్లా ప్రజల అదృష్టంగా భావించొచ్చు.

చికెన్, మటన్ వ్యర్థాల తరలింపు కోసం పోటా పోటీ

- జడ్చర్లలో చక్రం తిప్పుతున్న నడిగడ్డ వ్యాపారి
- పాలమూరులో రూ.15 లక్షలకు టెండర్
- ఇక్కడ కేవలం రూ.75 వేలకే రెన్యువల్
- చిన్న షాపుల నిర్వాహకులకు డబ్బులు ఇవ్వని కాంట్రాక్టర్
- వ్యర్థాలను చేపల చెరువులు, కుక్క బిస్కెట్ తయారీ కంపెనీలకు అమ్మకం
- తద్వారా లక్షలు గడిస్తున్న వ్యాపారులు



ఫౌల్ట్రీ కోళ్లు

జడ్చర్ల, ఆగస్టు 2: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల తరలింపు కోసం వ్యాపారులు పోటీ పడుతున్నారు. ఈ విషయంలో నడిగడ్డకు చెందిన ఓ వ్యాపారి తనదైనశైలిలో చక్రం తిప్పుతున్నాడు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.15 లక్షలకు ఓ కాంట్రాక్టర్ టెండర్ దక్కించుకోగా, జడ్చర్ల మునిసిపాలిటీలో కేవలం రూ.75 వేలు చెల్లించి టెండర్‌ను రెన్యువల్ చేసుకోవడం గమనార్హం. ఈ వ్యర్థాల తరలింపు టెండరును రాజకీయ నాయకుల జోక్యంతో ఒక్కో మునిసిపాలిటీలో ఒక్కో రేటుకు ఇస్తున్నారు. అయితే ఈ వ్యర్థాల తరలింపు టెండరును స్థానికంగా ఉన్న చికెన్ సెంటర్ నిర్వాహకుల యూనియన్‌కే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్

వ్యర్థాల తరలింపు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారని చికెన్, మటన్ సెంటర్‌ల నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. సదరు కాంట్రాక్టర్ ఒక్కో చికెన్ సెంటర్ నిర్వాహకుడికి కనీసంగా రూ.10 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు విడతల వారీగా డబ్బులు ఇచ్చేలా ముందుగానే ఒప్పందం చేసుకుంటారు. రోజుకు 10 నుంచి 20 కోళ్లు కోసి, చికెన్ విక్రయించే తమకు కాంట్రాక్టర్ డబ్బులు ఇవ్వకుండానే వ్యర్థాలను తీసుకెళ్తున్నాడని చెబుతున్నారు. డబ్బులు ఇవ్వాలని అడిగితే వ్యర్థాలు ఎక్కడ పారబోసుకుంటావో పారేసుకో అంటూ తమపై జులుం ప్రదర్శిస్తున్నాడని అంటున్నారు. ఈ నేపథ్యంలో చికెన్ సెంటర్ల నిర్వాహకులు మరో వ్యాపారిని ఆశ్రయించి, కొంత డబ్బు తీసుకుని వ్యర్థాలను అందిస్తున్నారు. అయితే ఇలా చికెన్ సెంటర్ నిర్వాహకులతో నేరుగా వ్యర్థాలను తీసుకెళ్తున్న వ్యాపారులపై టెండరు దక్కించుకున్న కాంట్రాక్టరు ఫిర్యాదు చేసి, వ్యర్థాలను తరలిస్తున్న వారి వాహనాలను పట్టిస్తున్నాడు.

ఒక్కో టన్ను రూ.10 వేలకు విక్రయం

వాహనంలో దాదాపు మూడు టన్నుల వ్యర్థాలను తరలిస్తారు. ఈ వ్యర్థాలను క్యాట్‌ఫిష్ పెంపకం చేపడ్తున్న చెరువులకు తరలిస్తున్నారని సమాచారం. ఈ చెరువులు కొత్తకోట, పెబ్బేరు, ఎర్రవల్లి, గద్వాల ప్రాంతాలలో ఉన్నాయని, ఒక్కో టన్ను వ్యర్థాలను రూ.ఐదు వేల నుంచి రూ.ఎనిమిది వేలకు విక్రయిస్తామని ఓ వ్యాపారి వెల్లడించాడు. చికెన్ వ్యర్థాలతో పాటు చెక్కపొట్టు, బెల్లం, తౌడు, నూక తదితర వాటిని కలిపి కుక్క బిస్కెట్‌లు, చేపలకు దాణా తయారీ చేసే హైదరాబాద్‌లోని ఓ కంపెనీకి ఒక్కో టన్ను వ్యర్థాలను రూ.ఏడు వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నట్లు సదరు వ్యాపారి వివరించాడు. ఆదివారం, పండుగలు, సెలవు దినాలలో అత్యధికంగా రోజుకు 15 నుంచి 20 టన్నులు, మిగతా రోజుల్లో ఐదు నుంచి ఆరు టన్నుల వ్యర్థాలను తరలిస్తున్నట్లుగా చికెన్ సెంటర్ నిర్వాహకులు వెల్లడిస్తున్నారు. రోజుకు 10 నుంచి 20 కోళ్లను కోసే చికెన్ సెంటర్ నిర్వాహకులకు ఏడాదికి రూ.10 వేలు, 100కుపైగా కోళ్లను కోసే నిర్వాహకులకు రూ.రెండు లక్షలకుపైగా మాత్రమే టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ లేదా వ్యాపారి చెల్లిస్తున్నాడని చెబుతున్నారు. తమ వద్ద అతిచౌకగా వ్యర్థాలను తీసుకెళ్లి, వాళ్లు మాత్రం లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని అంటున్నారు.



వ్యర్థాల తరలింపు టెండర్‌ను చికెన్ సెంటర్ నిర్వాహకుల యూనియన్‌కే ఇవ్వాలంటూ జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు(ఫైల్)



చికెన్ సెంటర్ల నిర్వాహకులకే ఇవ్వాలి

చికెన్, చేపలు, మటన్ వ్యర్థాలను తరలించే టెండర్‌ను తమకే ఇవ్వాలని జడ్చర్ల చికెన్ సెంటర్ నిర్వాహకుల యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రోజూ ఎంతో కష్టపడి, పెట్టుబడులు పెట్టి వ్యాపారం నిర్వహించుకుంటున్నామని, యూనియన్‌కు టెండర్‌ను ఇస్తే కొంత లాభం చేకూరుతుందని చెబుతున్నారు. ఈ విషయమై జడ్చర్ల మునిసిపల్ కమిషనర్‌కు యూనియన్ నాయకులు వినతి ప్రతం అందించారు. మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో రూ.15 లక్షలకు వ్యర్థాల తరలింపు టెండర్‌ను ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. అయితే జడ్చర్ల మునిసిపాలిటీలో మాత్రం నడిగడ్డ ప్రాంతానికి చెందిన బలరాముడుకు కేవలం రూ.75 వేలకే మునిసిపల్ అధికారులు టెండరును రెన్యువల్ చేసారు. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే టెండర్‌ను రెన్యువల్ చేశారని, దానిని రద్దు చేయాలని జడ్చర్ల మునిసిపాలిటీలోని చికెన్ సెంటర్ నిర్వాహకులు డిమాండ్ చేస్తున్నారు.

తమకే టెండర్ ఇవ్వాలి

మునిసిపాలిటీలలో స్థానికంగా ఉన్న చికెన్ సెంటర్ నిర్వాహకుల యూనియన్‌కే వ్యర్థాల తరలింపు టెండర్‌లను ఇవ్వాలి. టెండర్ నిర్వహించేటప్పుడు చికెన్ సెంటర్ నిర్వాహకులకు సమాచారం ఇవ్వాలి. జడ్చర్లలో రెన్యూవల్ చేసిన టెండర్‌ను రద్దు చేసి, మళ్లీ టెండర్ ప్రక్రియను నిర్వహించాలి.

- వెంకటేశ్, చికెన్ సెంటర్స్ యజమానుల యూనియన్ జడ్చర్ల అధ్యక్షుడు



శాకాంబరి అలంకరణలో అమ్మవారు

శాకాంబరీదేవిగా జోగుళాంబ

అలంపూర్, ఆగస్టు 2 : ఆషాఢమాసం చివరి శుక్రవారం సందర్భంగా అలంపూర్ క్షేత్రంలో కొలువైన జోగుళాంబ అమ్మవారు శాకాంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధికసంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారికి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ సరిత అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌బాబు, వెంకట్రామిరెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, రాజశేఖర్, నాగేంద్రయాదవ్ ఉన్నారు.

రూ.లక్ష పెట్టుబడికి ప్రతీ నెల రూ.40 వేలు ఇస్తా

- జోగులాంబ గద్వాల జిల్లా అయిజలో గుజరాత్ వ్యాపారి రూ.15 కోట్లు వసూలు
- విచారణ చేపట్టిన పోలీసులు

అయిజ, ఆగస్టు 2 : లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే ప్రతీ నెల రూ. 40 వేల ఆదాయం వస్తుందంటూ ఓ వ్యక్తి ప్రజల నుంచి డబ్బు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై సమాచారం అందుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయానికి కూత వేటు దూరంలో గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌కు చెందిన కుందన్ మక్వానా అనే వ్యక్తి ఏజీజీకే ట్రేడర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. తన వద్ద లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే ప్రతీ నెల రూ.40 వేల చొప్పున ఇస్తామంటూ ప్రచారం చేసుకున్నాడు. ఇలా గత మూడు నెలల్లో ప్రజల నుంచి రూ.10 కోట్ల నుంచి రూ.15 కోట్ల వరకు వసూలు చేసినట్లు పట్టణంలో చర్చ కొనసాగుతోంది. పెట్టుబడి పెట్టిన వారికి గ్యారెంటీ పేరుతో పోస్ట్ డేటెడ్ చెక్కులు కూడా ఇస్తున్నట్లు తెలిసింది. ఇతరులతో పెట్టుబడి పెట్టిస్తే కమీషన్ కూడా ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై సమాచారం అందడంతో పోలీసులు విచారణ చేపట్టారు. శాంతినగర్ సీఐ టాటాబాబు, అయిజ ఎస్ఐ విజయ్‌భాస్కర్ శుక్రవారం మధ్యాహ్నం కార్యాలయానికి వెళ్లి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు విచారణ చేపట్టినట్లు తెలిపారు. నేరం జరిగినట్లు రుజువైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అయిజలో గుజరాత్ వ్యక్తి ఏర్పాటు చేసిన కార్యాలయం



విచారణకు వచ్చిన పోలీసులు

విద్యార్థులకు పంటలపై అవగాహన

మక్తల్, ఆగస్టు 2: నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాల తమ విద్యార్థులను శుక్రవారం వ్యవసాయ క్షేత్ర పర్యటనకు తీసుకెళ్లింది. రైతులు, మహిళా రైతుల వేషధారణ అయిన విద్యార్థులు పంచె కట్టు, అంగీ ధరించగా.. విద్యార్థులు చీర కట్టుకున్నారు. పట్టణ సమీపంలో పత్తి పంట వద్దకు వారిని తీసుకెళ్లి పంటల సాగు పద్ధతులు, ఎరువులు, పనిముట్ల వాడకం, పంట దిగుబడి పెంచడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యవసాయంపై అవగాహన కల్పించడానికి ఈ పర్యటన నిర్వహించినట్లు తెలిపారు.



బ్యాంకుల వద్ద బారులు

- రుణమాఫీతో ఆయా బ్యాంకులకు వెళ్తున్న రైతులు
- మాఫీ అయిన వారు కొత్త రుణాల కోసం..
- కాని వారు స్టేట్‌మెంట్ల కోసం..


నారాయణపేట, ఆగస్టు 2: రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్షన్నర వరకు రెండు విడుతల్లో రైతు రుణాలు మాఫీ చేయడంతో నారాయణపేట జిల్లా వ్యాప్తంగా రైతులు బ్యాంకుల వద్ద బారులు తీరుతున్నారు. రుణమాఫీ అయిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా, కాని వారు ఆందోళనకు గురవుతున్నారు. తమకు మాఫీ ఎందుకు కాలేదని బ్యాంకు అధికారులను అడుగుతున్నారు. బ్యాంకు స్టేట్‌మెంట్లు తీసుకొని, ఆధార్, పట్టా పాస్‌బుక్, బ్యాంకు ఖాతాబుక్‌ల జిరాక్స్‌లను వ్యవసాయ అధికారులకు అందించి, తమకూ మాఫీ వర్తింపజేయాలని కోరుతున్నారు. మాఫీ అయిన రైతులు కొత్త రుణాల కోసం తెల్లవారుజామునే బ్యాంకుల వద్దకు చేరుకుంటున్నారు. కొన్ని బ్యాంకులు ముందస్తు టోకెన్లు అందించకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. నారాయణపేట ఎస్‌బీఐ దగ్గర రుణాల కోసం టోకెన్లు తీసుకునేందుకు రైతులు అధిక సంఖ్యలో బారులు తీరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 28,684 మంది రైతులకు రూ.165 కోట్లా 45 లక్షలు రుణాలు మాఫీ కాగా, రెండో విడతలో 18,496 మంది రైతులకు రూ.181 కోట్లా 83 లక్షల రుణాలు మాఫీ అయ్యాయి.



నారాయణపేట ఎస్‌బీఐ బ్రాంచి దగ్గర బారులు తీరిన రైతులు

కలెక్టర్ డీపీతో ఫేక్ అకౌంట్

మహబూబ్‌నగర్, ఆగస్టు 2: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అమాయకులతో అందినకాడికి కాజేస్తున్నారు. ఈ క్రమంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి వాట్సాప్ డీపీతో శుక్రవారం నకిలీ అకౌంట్‌ను క్రియేట్ చేశారు. చాటింగ్ చేశారు. ఈ విషయాన్ని కొందరు కలెక్టర్ దృష్టికి తేవడంతో స్పందించిన ఆమె ఎస్పీ జానకికి తెలిపారు. వెంటనే సంబంధిత అకౌంట్ ఫోన్ నెంబర్‌పై పోలీసులు దృష్టి పెట్టారు. ఎస్పీ జానకి మాట్లాడుతూ 94784605962 నెంబర్‌తో నకిలీ అకౌంట్‌ను సృష్టించారని తెలిపారు. ఈ నెంబర్ నుంచి కాల్ చేసినా, చాటింగ్ చేసినా వెంటనే పోలీసులకు చెప్పాలని కోరారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు.



కలెక్టర్ డీపీతో క్రియేట్ చేసిన వాట్సాప్ ఫేక్ అకౌంట్

ఆంధ్రజ్యోతి దినపత్రికలో...
ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు ఈ క్రింది నెంబర్లకు సంప్రదించగలరు.
మహబూబ్‌నగర్ : 9985411175, 9985403259
నాగర్‌కర్నూల్ : 9985410905
కల్వకుర్తి : 9985403252
వనపర్తి : 9985403242
గద్వాల : 9985403238
నారాయణపేట : 9985411463
మరిన్ని వివరాలకు సంప్రదించండి
9985411365

మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: నెం.302బి, 3వ సద్గురు ఇమేజెస్ క్యాపిటల్ పార్క్, ఇమేజ్ గార్డెన్స్ రోడ్, వివిప హిల్స్, మాధాపూర్, హైదరాబాద్, తెలంగాణ-500081
టెలి: 040-49951666, ఇ-మెయిల్: co@maximusarc.com

స్థిరాస్తుల అమ్మకం కొరకు విక్రయ ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 8(6) ప్రొవిజనులతో కలిపి చదువుతూ, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన.
సాధారణ ప్రజలు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత(లు) మరియు గ్యారంటార్(లు)లకు నోటీసు ఇచ్చేదేమంటే, దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టు పెట్టబడినవి/ చార్జి చేయబడినవి మరియు అధీకృత అధికారి, మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ వారిచే నిర్మాణాత్మక స్వాధీనం చేసుకోబడినవి మరియు మెస్సర్స్ మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ వారికి (యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఇ-ఆంధ్రా బ్యాంక్) వారిచే అసైన్‌మెంట్ అగ్రిమెంట్ తేది 20.12.2017 ద్వారా మెస్సర్స్ మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ వారికి అసైన్ చేయబడినది) 30.06.2024 నాటికి గల బకాయి రూ. 2,42,85,814/- (రెండు కోట్ల నలభై రెండు లక్షల ఎనభై ఐదు వేల ఎనిమిది వందల పద్నాలుగు రూపాయలు మాత్రమే)లను అదనపు వడ్డీ, ఛార్జీలు, ఖర్చులతో సహా మొత్తం బకాయి చెల్లించబడువరకు గల ద్రవ్యముతో సహా మెస్సర్స్ ఐడిఎస్ బిజినెస్ సిస్టమ్స్ లిమిటెడ్, (ఋణగ్రహీత) మరియు శ్రీ ఆర్.బాలకృష్ణన్, శ్రీమతి బి.వాసంతి, శ్రీమతి ఆర్.రుక్మిణి, కుమారి బి.కృతిక, శ్రీ జి.భాస్కరన్ మరియు శ్రీమతి బి.లలిత (హామీదారులు) నుంచి రాబట్టుకొనేందుకు గానూ "ఎక్కడ ఉన్నవి అక్కడే" "ఏదైతే అదే" మరియు "అక్కడ ఏదైతే ఉందో అదే" ప్రాతిపదికన 11.09.2024న విక్రయించబడను. రిజర్వు ధర: లాట్-1 కొరకు రూ.22 లక్షలు, లాట్-2 కొరకు రూ.20 లక్షలు, ధరావతు: లాట్-1 కొరకు రూ.2.50 లక్షలు, లాట్-2 కొరకు రూ.2 లక్షలు.

స్థిరాస్తి సంక్షిప్త వివరణ

క్ర.సం.	ఆస్తి వివరణ
లాట్-1	శ్రీమతి బి.వాసంతి & కుమారి బి.కృతిక లకు చెందిన, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్ సబ్-రిజిస్ట్రార్, కొత్తూర్ మండలం, చేగూర్ గ్రామం వద్ద సర్వే నం.490 నుండి 527 లలో "గంగోత్రి గ్రీన్‌ఫీల్డ్స్"లో గల ఫేజ్-III లోని ఓపెన్ ప్లాట్ నం.13 & 14ల యొక్క విస్తీర్ణం 560 చ.గ.లు (ఒక్కొక్కదాని విస్తీర్ణం 280 చ.గ.లు) గల యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.20, పశ్చిమం: రోడ్డు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.15.
	రిజర్వు ధర: రూ.22 లక్షలు, ధరావతు: రూ.2.50 లక్షలు
లాట్-2	శ్రీమతి బి.వాసంతి & కుమారి బి.కృతిక లకు చెందిన, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్ సబ్-రిజిస్ట్రార్, కొత్తూర్ మండలం, గూడూర్ గ్రామం వద్ద సర్వే నం.205లో "గంగోత్రి గ్రీన్‌ఫీల్డ్స్"లో గల ఫేజ్-II లోని ఓపెన్ ప్లాట్ నం.11 యొక్క విస్తీర్ణం 500 చ.గ.లు గల యావదాస్తి. సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నం.12, పశ్చిమం: 33 అడుగుల రోడ్డు, ఉత్తరం: 60 అడుగుల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నం.10.
	రిజర్వు ధర: రూ.20 లక్షలు, ధరావతు: రూ.2 లక్షలు

తెలిసిన ఎన్‌కంబ్రెన్స్‌లు: లేవు
ఆస్తుల తనిఖీ చేయు తేది మరియు సమయం: 28.08.2024న ఉ.11.00గం. నుండి సా.4.00 గం.వరకు
వేలం విధానం: https://sarfaesi.auctiontiger.net ద్వారా ఆన్‌లైన్ ఇ-వేలం.
అన్ని లాట్లకు ధరావతు చెల్లింపునకు మరియు బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ మరియు సమయం: 10.09.2024న సా. 5.00 గం.లోపు
ఇ-వేలం తేది: లాట్-1కి 11.09.2024, ఉ. 10.00 గం. నుండి ఉ.11.00 గం. మధ్య. లాట్-2కు: 11.09.2024, ఉ. 11.00 గం. నుండి మ.12.00 గం. మధ్య.
బిడ్ పెంపుదల: లాట్ 1కి రూ.1,00,000/-, లాట్ 2కు రూ.1,00,000/-
వివరంగా ఉన్న విక్రయం నియమ నిబంధనలకు, మాక్సిమస్ ఎఆర్‌సి లిమిటెడ్ (సెక్యూర్డ్ క్రెడిటార్) వారి వెబ్‌సైట్ అనగా www.maximusarc.com/tenders లో ఉన్న లింకును దయచేసి చూడగలరు.
ఉద్దేశించిన కొనుగోలుదారులు ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ కోడ్, 2016లోని సెక్షన్ 29ఎ కింద అనర్హులు కాదని నిర్ధారిస్తూ "నోటరైజ్డ్ అఫిడవిట్" సమర్పించాలి
తేది: 29-07-2024 స్థలం: హైదరాబాద్
సం/- (కె.హరి కృష్ణ) - సెల్: 966648800 అధీకృత అధికారి





మూడు ఇళ్లలో దొంగతనాలు

శ్రీరంగాపురం, ఆగస్టు 2: వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలం జానంపేట గ్రామంలో గురువారం ముగ్గురు రైతుల ఇళ్లల్లో చోరీలు జరిగాయి. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శ్రీరామ్‌రెడ్డి ఇంట్లో రూ.లక్షా 43 వేలు, ఏ.బాల్‌రెడ్డి ఇంట్లో రూ.50 వేలు, వంకరెడ్డి ఇంట్లో రెండు తులాల బంగారు, రూ.60 వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఇళ్లను కొత్తకోట సీఐ రాంబాబు, పెబ్బేరు, శ్రీరంగాపూర్ ఎస్సైలు హరిప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, సిబ్బంది పరిశీలించారు. క్లూస్‌టీం బృందం వివరాలు సేకరించింది. రైతులు వరి నాట్లకు వెళ్లడంతో పట్టపగలే చోరీలు జరిగాయి. కేసు దర్యాప్తులో ఉంది.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


దామరగిద్ద, ఆగస్టు 2: ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మద్దెల్‌బీడ్ స్టేజీ సమీపంలో శుక్రవారం చోటు చేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరగిద్ద గ్రామానికి చెందిన ఎనికల లాలప్ప, చంద్రశేఖర్ రెడ్డి, వీరప్ప ముగ్గురు ద్విచక్ర వాహనంపై నారాయణపేటకు బయలుదేరారు. మద్దెల్‌బీడ్ స్టేజీ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో లాలప్ప (18) అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన చంద్రశేఖర్‌రెడ్డిని, వీరప్పను నారాయణపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. చంద్రశేఖర్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యతో మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజు తెలిపారు.




మధ్యాహ్న భోజన కార్మికులకు
పెండింగ్ బిల్లులు చెల్లించాలి

● జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

జడ్చర్ల, ఆగస్టు 2 : మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య డిమాండ్ చేశారు. జడ్చర్ల తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు కనీసం రూ.12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద విద్యార్థులేనని, వారికి భోజనం అందించిన కార్మికుల బిల్లులను పెండింగ్‌లో ఉంచడం సరైందికాదని అన్నారు. మార్కెట్‌లో ఒక గుడ్డు ధర రూ.6.50 పైసలు ఉందని, కానీ మెనూ ప్రకారం రూ.5 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న విధంగానే పాఠశాలలకు గుడ్లు సరఫరా చేయాలని, గ్యాస్‌ను సబ్సిడీపై అందచేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సత్యనారాయణరెడ్డికి వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో కౌసల్య, పద్మ, లక్ష్మమ్మ, అంజమ్మ, స్వప్న, జంగమ్మ, అనిత, షబానా, నాగమ్మ, యాదమ్మ, అన్నపూర్ణ, పార్వతమ్మ, కమలమ్మ, వెంకటమ్మ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.













ప్రాణ సంకటం

- ప్రమాదకరంగా మారిన లోలెవల్ కాజ్‌వేలు
- వర్షాకాలంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు
- దుందుభీ నదిలోని కాజ్‌వేపై ప్రజల ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోని అధికారులు
- వర్షాకాలం ప్రారంభమైందంటే భయం భయం

తాడూరు, ఆగస్టు 2 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో పలు గ్రామాల్లోని ప్రధాన రహదారులపై లోలెవల్ కాజ్‌వేలు ఉండడం మూలంగా వర్షాకాలం వచ్చిందంటే చాలు ప్రతినిత్యం భయం భయంతో కాజ్‌వేల వద్ద ప్రాణసంకటంగా మారింది. వర్షాలు భారీగా కురిసి వరద ప్రవాహం జరిగే క్రమంలో కాజ్‌వే ప్రాంతం నుంచి అవతలికి దాటేందుకు వెళ్తున్న క్రమంలో ప్రతినిత్యం ప్రమాదాల బారిన పడుతూ పదుల సంఖ్యలో పలువురు మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. ఈ సమస్యపై గత కొన్ని సంవత్సరాలుగా ప్రధాన రహదారుల వెంట ఉన్న లోలెవల్ కాజ్‌వేలను తీసివేసి హైలెవల్ వంతెనలను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను రక్షించాలంటూ అధికారులకు ప్రజాప్రతినిధులకు మొర పెట్టుకున్నా నేటికీ స్పందించడం లేదంటూ అయా గ్రామాల్లోని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● దుందుభీ నదిలోని పరిస్థితి ఇలా....

మండలంలోని సిర్సవాడ నుంచి కల్వకుర్తి పట్టణానికి వెళ్లే ప్రధాన రహదారిపై దుందుభీ నదిలో గత 30ఏళ్ల క్రితం లోలెవల్ కాజ్‌వేను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం కాజ్‌వే పూర్తిగా వరద ప్రవాహానికి దెబ్బతిని శిథిలావస్థకు చేరి గుంతలమయంగా మారి తరచూ వరద ప్రవాహం వచ్చినప్పుడు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. గత రెండు సంవత్సరాల క్రితం దుందుభీ నదిలోని కాజ్‌వేపై నుంచి పర్వతాలు అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో వరద ఉధృతిని తాళలేక నదిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయిన ఘటన విషాదభరితంగా మారింది. ఈ క్రమంలోనే సిర్సవాడ గ్రామస్థులు అప్పటి ఆర్డీవో, కలెక్టర్, ప్రజాప్రతినిధులకు సైతం దుందుభీ నదిలో హైలెవల్ వంతెనను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిందిగా మొర పెట్టుకున్నా నేటికీ ఆ వంతెన పనులు కార్యరూపం దాల్చడం లేదు. అదేవిధంగా ఐతోల్, గోవిందాయపల్లి, భలాన్‌పల్లి, నాగదేవ్‌పల్లి, ఆకునెల్లికుదురు, మేడిపూర్, యాదిరెడ్డిపల్లి, యత్మతాపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలు వర్షాలు పడుతున్న క్రమంలో మరణమృదంగాలు మోగుతున్నాయి. అయినప్పటికీ ఏ ఒక్కరు పట్టించుకోకపోవడం మూలంగా అయా గ్రామాల ప్రజలు వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దుందుభీ నదిలో సిర్సవాడ వద్ద హైలెవల్ వంతెన ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారులపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలను హైలెవల్ వంతెనలుగా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే నిర్మాణ పనులు కొనసాగించే విధంగా చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడాల్సిందిగా అయా గ్రామాల్లోని ప్రజలు కోరుతున్నారు.



సిర్సవాడ వద్ద దుందుభీ నదిపై హైలెవల్ వంతెన నిర్మించాల్సిన ప్రదేశం



ఐతోల్ గ్రామం వద్ద నాగర్‌కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిపై లోలెవల్ కాజ్‌వేపై ప్రవహిస్తున్న నీటిలో చిక్కుకున్న కారు (ఫైల్)

ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో

సమానత్వానికి భంగం

- జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి



మాట్లాడుతున్న జాతీయ మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సత్తి

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో సమానత్వానికి భంగం వాటిల్లుతోందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు మందిరంలో జాతీయ మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింత సత్తి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై మాలమహానాడు న్యాయ పోరాటానికి సిద్ధమని, మాలలు ఎవరూ ఉద్వేగానికి లోనుకాకుండా సంయమనం పాటించాలన్నారు. ఆగస్టు 7, 8, 9 తేదీల్లో జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఢిల్లీలో జరిగే మాలలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల భాస్కర్, అధికార ప్రతినిధి సామ మహేష్, నాయకులు మద్దెల చంటి, కర్ణ, మధు, రాజేంద్రప్రసాద్, చెన్నకేశవులు, చంద్రయ్య, చిన్నయ్య, మల్లేష్, శేఖర్, సుందీప్, కురుమయ్య, సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

- నష్ట పరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్



నీట మునిగిన పంట పొలంలో రైతులు

ధరూరు, ఆగస్టు 2 : కృష్ణానదికి వరద పోటెత్తడంతో ధరూరు మండలంలోని భీంపురం గ్రామానికి చెందిన రైతుల పంట పొలాలు నీట మునిగాయి. తమకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు రామాంజనేయులు, శ్రీనివాసులు, భీమన్న, గోవిందమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూరాల జల విద్యుత్ ప్రాజెక్టు కింద తమ పొలాలు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. ఆ సమయంలో తమ పొలాలకు హద్దులు నిర్ణయించి పరిహారం చెల్లించాలని కోరినా పట్టించుకోలేదన్నారు. రేకులపల్లి శివారులో, తమకు చెందిన 16 ఎకరాల భూమి ప్రతీ సంవత్సరం ముంపునకు గురవుతోందని తెలిపారు. ఈ విషయంపై గతంలో కలెక్టర్, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందించినట్లు తెలిపారు. అయినా ఇప్పటివరకు అధికారులు స్పందించలేదని తెలిపారు. ఇప్పటికైనా ముంపు భూముల జాబితాలో తమ పొలాలను చేర్చి, పంట నష్ట పరిహారం అందేలా చొరవ తీసుకోవాలని కోరారు. జెన్‌కో అధికారులు సర్వే చేయించి, భూమికి హద్దులు ఏర్పాటుచేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

పద్మశాలీలు ఐక్యంగా పోరాడాలి

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి



భక్తమార్కండేయ దేవాలయం నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

కల్వకుర్తి టౌన్, ఆగస్టు 2 : పద్మశాలి సంఘం సభ్యులు ఐక్యంగా పోరాడాలని రాష్ట్రపద్మశాలి సంఘం అధ్యక్షుడు కమర్తపు మురళి అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న భక్తమార్కండేయ దేవాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ఇటీవల వంగూర్ మండలం పరిధిలోని ఉల్పర గ్రామంలోని రైతు క్యామ శ్రీనివాసులుపై జరిగిన సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడోఒక చోట పద్మశాలికులస్తులపై జరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే అందరూ ఐక్యంగా ఉండి స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన్యాయం జరిగేవరకు పోరాడాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగుల వెంకటేశ్వర్లు, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుడి నుంచి బంగారం, వెండి రికవరీ

పెబ్బేరు, ఆగస్టు 2 : పక్క ఇంటిపై కన్నేసి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బంగారు, వెండి వస్తువులను దొంగిలించిన యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరు గ్రామానికి చెందిన చుక్కా శ్రీకాంత్ అనే యువకుడు అదే గ్రామంలో వారి ఇంటి పక్కనే ఉన్న పరమేష్ అనే వ్యక్తి ఇంటిపై కన్నేసి వారు ఎవరు లేని సమయంలో ఇంట్లోకి వెళ్లి బంగారు నగలను దోచుకెళ్లాడు. గతనెల 31న దొంగతనం చేయగా ఈనెల రెండో తేదీ తెల్లవారుజామున నిందితుడిని గుర్తించి విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. అతని నుంచి రెండున్నర తులాల బంగారం నాను, మూడు మాసాల మాట్నీలు, ఒకటిన్నర మాసం రెండు చిన్న ఉంగరాలు, మూడు తులాల వెండి మొలతాడును రికవరీ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దొంగతనం కేసును త్వరగా ఛేదించినందుకు కొత్తకోట సీఐ రాంబాబును, ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

కొలిక్కిరాని జెన్‌కో సామగ్రి చోరీ కేసు

- అన్ని కోణాల్లో విచారణ చేస్తున్న పోలీసులు



ఫిర్యాదు చేసిన రోజు గోదాంలో పెట్టెలను పరిశీలిస్తున్న ఎస్ఐ నరేందర్, జెన్‌కో సిబ్బంది (ఫైల్)

ఆత్మకూరు, ఆగస్టు 2 : దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఈయేడాది జూన్ ఎనిమిదో తేదీన సామగ్రి చోరీ కేసు విచారణ రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కట్టుదిట్టమైన భద్రతా సిబ్బంది ఉన్న గోదాములోని కాపర్ ప్లేట్లు గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. రేయింబవళ్లు రక్షణ సిబ్బంది పర్యవేక్షణ ఉన్నా విలువైన సామగ్రి చోరీ జరగడం అప్పట్లో చర్చనీయాంశమైంది. గోదాము వద్ద విధులు నిర్వహించే ఏఈ వెంకటేశ్వర్‌రావు చోరీ జరిగిన మరుసటి రోజు ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దొంగిలించిన సామగ్రి విలువ దాదాపు ఎనిమిది లక్షలు వరకు ఉంటుందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. కానీ చోరీకి గురైన సామగ్రి విలువ దాదాపు రూ.20 లక్షలు ఉంటుందని సిబ్బంది అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జెన్‌కో సిబ్బంది, పోలీస్ యంత్రాంగం మధ్య సమన్వయ లోపం వల్లే దర్యాప్తు ముందుకు సాగడం లేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎస్సై నరేందర్ అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నా దొంగలు దొరకడం లేదు.

ఇంటి దొంగల పనేనా.?

జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ప్రధాన కార్యాలయాలకు దూరంగా ఉన్న గోదాంలో నిర్మాణ యంత్ర పరికరాలతో పాటు, విలువైన సామగ్రిని జెన్‌కో అధికారులు భద్రపరిచారు. భద్రపరిచిన చెక్క పెట్టెలో సంఖ్య కేటాయించి ఏ పెట్టెలో ఏ పరికరం ఉంది అనే అంశాలను రికార్డులో నమోదు చేస్తారు. అయితే భద్రపరిచే క్రమంలో కేవలం విలువైన రాగి ప్లేట్లు ఉన్న వాటిని ఎత్తుకెళ్లడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం చుట్టు ఎత్తయిన ప్రహారీపై ఇనుప కంచె కూడా అమర్చారు. బయటి వ్యక్తులు లోపలికి వచ్చే వీలు లేకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గోదాం చుట్టు సీసీ కెమెరాలు, మరోవైపు భద్రతా సిబ్బంది గస్తీ ఉన్నా లోపలికి వచ్చి దోచుకెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోంది. పోలీసుల విచారణలో ఎలాంటి వాహనాల రాకపోకల ఆనవాళ్లు లేవని తెలిపారు. సీసీ కెమెరాలు పరిశీలించగా ప్రధాన ద్వారానికి అమర్చిన సీసీ కెమెరాకు సెల్‌ఫోన్ లైట్ వేయడంతో ఎవరనేది కన్పించడం లేదని, కెమెరాలు ఉంటాయని తెలిసీ లోపలికి చొరబడ్డారంటే కచ్చితంగా తెలిసిన వారే చోరీకి పాల్పడి ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దర్యాప్తునకు జెన్‌కో అధికారులు సహకరించాలి



దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో రెండునెలల క్రితం జరిగిన చోరీ కేసులో జెన్‌కో సిబ్బంది దర్యాప్తునకు సహకరించాలి. అటువంటప్పుడే దొంగలను త్వరగా గుర్తించే అవకాశం ఉంటుంది. కేసు నమోదు పత్రాలను తీసుకునేందుకు జెన్‌కో అధికారులు ఆసక్తి కనబరిచినంతగా విచారణకు కూడా ఆసక్తి కనబరచాలని కోరాం. ఈ చోరీ కేసులో బయటి వ్యక్తులతో పాటు, జెన్‌కో సిబ్బంది ప్రమేయం కూడా ఏ మేరకు ఉందన్న అంశంపై కూడా దృష్టి సారిస్తున్నాం. త్వరలోనే చోరీ కేసులో నిందితులను గుర్తిస్తాం.

- నరేందర్, ఎస్ఐ

గ్రామీణ క్రీడాకారుల సేవలు ఎంతో అవసరం

- అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్, ఆగస్టు 2 : గ్రామీణ ప్రాంత క్రీడాకారుల సేవలు దేశానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రభుత్వం మరింత ప్రోత్సహిస్తే వారి సేవలు దేశానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. తెలంగాణ ఖ్యాతి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తుందన్నారు. గతంలో తాను కూడా క్రికెట్‌పై మక్కువతో మహారాష్ట్రకు వెళ్లానన్నారు. సచిన్, అజారుద్దీన్ వంటి క్రీడాకారులతో కలిసి పాల్గొన్నట్లు తెలిపారు. తన కుటుంబానికి క్రికెట్, వాలీబాల్‌తో విడదీయరాని సంబంధం ఉందన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు పెద్ద పీట వేసేలా నిర్ణయాలు తీసుకోవడం శుభపరిణామం అన్నారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

తెలకపల్లి, ఆగస్టు 2 : నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇందుకు సంబంధించి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డైసీసునాలినీ తెలిపిన వివరాల ప్రకారం... గురుకుల పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థినీ గురువారం అర్ధరాత్రి బట్టలు ఉతికే సర్ఫ్ లిక్విడ్‌ని తాగుతుండగా తోటి విద్యార్థి అడ్డగించింది. దాంతో స్థానిక నర్సు సహాయంతో 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి ఇంటి దగ్గర తల్లిదండ్రుల గొడవే కారణమని తోటి విద్యార్థులతో ఆవేదన వ్యక్తం చేసిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం విద్యార్థిని జిల్లా కేంద్రంలోని జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటన మండల కేంద్రంలో చర్చనీయాంశానికి దారి తీసింది.

కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజర్‌గా చంద్రశేఖర్



కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చంద్రశేఖర్

కొల్లాపూర్, ఆగస్టు 2 : కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్‌గా చంద్రశేఖర్ శుక్రవారం సాయంత్రం పదవీ బాధ్యత లు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక ఫారెస్టు సిబ్బంది ఆయనను శాలువా, పూల మాలలతో సన్మానించారు. నారాయణఖేడ్ నుంచి బదిలీపై వచ్చిన చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్‌గా విధు లు నిర్వహించిన శరత్ చంద్రారెడ్డి హైదరాబాద్‌లోని ఉప్పల్ అటవీ కార్యాలయానికి రేంజర్‌గా బదిలీపై వెళ్లారు.

అమ్రాబాద్ ఎఫ్‌డీవోగా రామమూర్తి



ఎఫ్‌డీవో రామమూర్తి

మన్ననూర్, ఆగస్టు 2: అమ్రాబాద్ డివిజన్ అటవీశాఖ ఎఫ్‌డీవో గా రామమూర్తి, మన్ననూరు రేంజ్ అధికారిగా దేవజ నియమితు లయ్యారు. అమ్రాబాద్ ఎఫ్‌డీవో పోస్టు గత కొంతకాలంగా ఖాళీగా ఉండడంతో డీఎఫ్‌వో రోహిత్ గోపిడియే అదనపు బాధ్యతలు నిర్వహిస్తుండేవారు. మన్ననూరు రేంజర్‌గా ఉన్న ఈశ్వర్ బదిలీపై లింగాలకు వెళ్లగా ఆయన స్థానంలో కొత్త రేంజర్‌గా దేవజ బదిలీపై మన్ననూరుకు వచ్చారు. కొత్తగా వచ్చిన అధికారులను డీఎఫ్‌వో అభినందించారు.

చెంచుల సంబురాలు



మన్ననూరు అంబేడ్కర్ కూడలి వద్ద సంబురాలు జరుపుకుంటున్న చెంచులు

మన్ననూర్, ఆగస్టు 2: ఎస్సీ ఎస్టీ వర్గీకరణ అవసరమని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై అమ్రాబాద్ మండలం మన్ననూరులో చెంచు సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన చెంచులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల వలన చాలా మంది చెంచులు ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉందని ఈ సందర్భంగా వారు అన్నారు. చెంచు సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి నాగయ్య, ఉపాధ్యక్షుడు దాసరి రాజేంద్రప్రసాద్, రాష్ట్ర గవర్నింగ్ బాడీ మాజీ సభ్యుడు శంకరయ్య పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్న గ్రామస్థులు



జడ్చర్ల మండలం ఉదండాపూర్ గ్రామపంచాయతీ వద్ద గ్రామస్థులు పట్టుకున్న టిప్పర్

జడ్చర్ల, ఆగస్టు 2 : అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌ను గురువారం రాత్రి ఉదండాపూర్ గ్రామస్థులు పట్టుకున్నారు. పట్టుకున్న టిప్పర్‌ను గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ఉంచారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నామని గ్రామస్థులు తెలిపారు. అక్రమంగా మట్టిని తరలించే మాఫియాకు రిజర్వాయర్ నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌లు, అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. పట్టుబడిన టిప్పర్ సైతం గొల్లపల్లి ప్రాంతానికి చెందిన మట్టి వ్యాపారం నిర్వహించే వ్యక్తిది అని తెలిసిందని, రాత్రి వేళల్లో వాహనాలతో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారంటూ గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వల్లూరు, ఉదండాపూర్ గ్రామాలకు చెందిన టిప్పర్‌లను గ్రామానికి అవసరమై మట్టిని తీసుకువచ్చే సందర్భంలో కాంట్రాక్టర్‌లు, అధికారులు పోలీసులకు పట్టిస్తారని ఆరోపించారు. మాఫియాకు సంబంధించిన టిప్పర్‌లను మాత్రం చూసీ, చూడనట్లుగా వ్యవహరిస్తారంటూ గ్రామస్థులు ఆరోపించారు. వల్లూరు, ఉదండాపూర్ రహదారి ఇప్పటికే ధ్వంసం అయ్యిందని, రోడ్డును మరమ్మతు చేయించాలని అధికారులను, ప్రజాప్రతి నిధులకు గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత


నవాబ్‌పేట, ఆగస్టు 2 : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రం శుక్రవారం తెలిపారు. ఎస్ఐ ఆదేశానుసారం పోలీస్ సిబ్బంది మండలంలోని కారుకొండ గేట్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గురువారం అర్ధరాత్రి జడ్చర్ల మండల ఖానాపూర్ గ్రామానికి చెంది రాజేందర్ అనేవ్యక్తికి చెందిన టిప్పర్‌ను ఆపి విచారించగా జిల్లా కేంద్రానికి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండటంతో దాన్ని పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మిడ్జిల్, ఆగస్టు 2 : మండల కేంద్రానికి చెందిన రమేష్ తన ప్లాటు పంచాయితీ విషయంలో తనకు న్యాయం జరగడంలేదని శుక్రవారం వాడ్యాల గ్రామ బస్‌స్టేజీ వద్ద పురుగుల మందు తాగినట్లు గ్రామస్థులు తెలిపారు. అది గమనించిన బంధువులు, కుటుంబసభ్యులు రమేష్‌ను ప్రైవేటు వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కొన్ని రోజులుగా గ్రామానికి చెందిన మరో వ్యక్తితో ప్లాటు పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం. రమేష్‌కు భార్య లక్ష్మమ్మతో పాటు ఇద్దరు పిల్లలున్నారని తెలిపారు. ఇదే విషయంపై స్థానిక ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడును వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో శవం లభ్యం

పెబ్బేరురూరల్, ఆగస్టు 2 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తిప్పాయిపల్లి గ్రామ సమీపంలో శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో గుర్తు తెలియని మగ మనిషి శవం లభ్యమైనట్లు ఎస్సై హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. మృతుడి వయసు 50 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, ఒంటిపై తెల్లషర్ట్, బూడిద కలర్ నిక్కరు ఉందని చెప్పారు. మృతుడి సమాచారం ఎవరికైనా తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.





అహింసా మార్గం అనుసరించాలి

- బాపు బాటను విజయవంతం చేయాలి - గాంధేయవాది జీవీ సుబ్బారావు

కోయిలకొండ, ఆగస్టు 2 : నేటి యువత శాంతి యుత అహింస మార్గం అనుసరించాలని ప్రముఖ గాంధేయవాది, తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు జీవీ సుబ్బారావు తెలి పారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మా ట్లాడుతూ గాంధీజీ స్థాపించిన గ్రామ స్వరాజ్య స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రా మంలో నేటి యువత మత్తు పదార్థాలు, మద్యా నికి బానిస కాకుండ చర్యలు తీసుకోవాలని సూచించారు. నేడు ప్రపంచ దేశాలు గాంధీజీ పిలుపునిచ్చిన అహింస మార్గం అనుసరిస్తున్నాయని వెల్లడించారు. గాంధీజీ స్వరాజ్య స్థాపన కోసం పాలమూరు విద్యావేత్త ప్రొఫెసర్ రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్ గాంధీ జయంతి అక్టోబరు 2 నుంచి అలంపూర్ నుంచి (ఉమ్మడి పాలమూరు జిల్లాలో) ఉమామహేశ్వరం వరకు వంద రోజుల బాపు బాట పాదయాత్ర నిర్వహిస్తారని తెలిపారు. బాపు బాట పాదయాత్రను ఉమ్మడి జిల్లా విద్యావేత్తలు, విద్యార్థులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం

దేవరకద్ర, ఆగస్టు 2 : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలి పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేశారు. విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని, కళాశాలల్లో మధ్యాహ్న భోజనం వడ్డించాలని, ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం సమస్యలను పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ దీపికకు వినతి పత్రం అందించారు.

పత్తి పంటపై సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి

- సహాయ వ్యవసాయ సంచాలకుడు ఆంజనేయులు

రాజాపూర్, ఆగస్టు 2 : పత్తి రైతులందరు పంటలపై సస్యరక్షణ చర్యలు తీసుకొని పంటలకు సకాలంలో మందులు వాడుతూ, కలుపు నివారించుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయులు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుండ్లపొట్లపల్లి గ్రామంలో పలువురు రైతులు వేసిన పత్తి పంటలను మండల వ్యవసాయ అధికారులు ఆధ్వర్యంలో పరిశీలించి, రైతులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు మండల పరిధిలోని రంగారెడ్డిగూడలోని రైతు వేదికలో బీమా పత్రాల సేకరణ గురించి ఆరా తీశారు. రైతు బీమా పథకాన్ని అర్హులైన ప్రతీ రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నరేందర్, ఏఈవో దీపిక, రైతులు మాన్యానాయక్, యాదగిరి, పాల్గొన్నారు.

హాస్టళ్లలో మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

పాలమూరు, ఆగస్టు 2 : సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి యం.కుర్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీఆర్‌ఓను కేవీపీఎస్ ప్రతినిధి బృందం కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేసింది. జిల్లాలో జూలై 20నుంచి 31వ తేదీ వరకు చేసిన సర్వేలో పలు సమస్యలను గుర్తించినట్లు తెలిపారు. ప్రధానంగా విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టడంలేదన్నారు. నాసిరకం భోజనంతో విద్యార్థులకు పోషకాలు అందటంలేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హైస్కూల్ విద్యార్థులకు మెస్ చార్జీలు రూ.950 నుంచి రూ.2000ల వరకు, కళాశాల విద్యార్థులకు రూ.1500 నుంచ రూ.2500లకు పెంచాలన్నారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో యం.కుర్మయ్య ఆదివిష్ణు, మనోహర్ పాల్గొన్నారు.

పీజీ కళాశాల వసతులపై యూనివర్సిటీ బృందం తనిఖీ

జడ్చర్ల, ఆగస్టు 2 : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో పీజీ వృక్షశాస్త్రంలో వసతులపై శుక్రవారం పాలమూరు యూనివర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వృక్షశాస్త్ర విభాగాధిపతి రమాదేవిలు తనిఖీలు నిర్వహించారు. జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రస్తుతం పీజీ తరగతులు ప్రారంభించడంతో విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల అంశంపై తనిఖీ నిర్వహించారు. అనంతరం కళాశాలలోని హెర్బేరియం, జీవవైవిధ్య పరిశోధనా, విద్యాకేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, వృక్షశాస్త్ర విభాగాధిపతి నర్మద, లెక్చరర్‌లు లత, వలంటీర్‌లు రాహుల్, మేఘన, ఇందు, అఖిల పాల్గొన్నారు.


జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న తనిఖీ బృందం

రుణాలు అందజేయాలని మైనార్టీల వినతి

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 2 : మైనార్టీ రుణాలు అందజేయాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు ముస్లింలీగ్ రాష్ట్ర కార్యదర్శి ఖుద్దుస్‌బేగ్ కలిసి వినతి పత్రం అందజేశారు. గత ఏడాది నిధులు విడుదల చేశారని, ఎన్నికల కోడ్ అమలుతో నిలిపివేశారని వినతిలో పేర్కొన్నారు. వెంటనే లబ్ధిదారు ఖాతాలో జామ చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మైనార్టీ యువతకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. రుణాలు మంజూరుకు కృషి చేస్తామని చైర్మన్ చెప్పినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో అహ్మద్ ముబిన్ ఉన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరుపతయ్య

మిడ్జిల్, ఆగస్టు 2 : స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరుపతయ్య బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహించిన వెంకటయ్య హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి బదిలీలిపై వెళ్లగా కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వహించిన తిరుపతయ్య ఇక్కడికి వచ్చారు.

క్రిస్టియన్ కాలనీలో ఇంటింటికీ మొక్కల పంపిణీ

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 : వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఇంటింటికీ మొక్కలు పంపిణీ చేశారు. కాలనీలోని కమ్యూనిటీ భవనంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు సీజే పూజిత ఆధ్వర్యంలో ఇళ్లల్లో పెంచుకునే మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు ఇళ్లలో పెంచుకునేందుకు ప్రభుత్వం పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేస్తుందని, వీటిని ఇంటిముందు, ఇంటి ఆవరణలో పెంచుకుని సంరక్షించుకోవాలని కోరారు. ఆ కార్యక్రమంలో వార్డు అధికారి యాదమ్మ, ఆర్పీ దివ్య, ఈసీ అంజమ్మ, నాజియ, జయశీల పాల్గొన్నారు.

కళాశాల ముందు విద్యార్థుల తల్లిదండ్రుల గొడవ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 2 : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కళాశాల ముందు విద్యార్థులు తల్లిదండ్రులు గొడవకుదిగారు. శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఓ కళాశాలకు చెందిన విద్యార్థులు కళాశాల బస్సులో వస్తున్నారు. పక్కన ఉన్న విద్యార్థినులను చూసి మిగతా విద్యార్థులు (బాలురు) కేరింతలు కొడుతూ ఈలలు వేశారు. అక్కడే ఉన్న కళాశాల అధ్యాపకులు విద్యార్థులను మందలించారు. దీంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పడంతో తల్లిదండ్రులు వచ్చి అధ్యాపకులతో గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు వచ్చి తల్లిదండ్రులను అక్కడి నుంచి పంపించారు. దీనిపై అక్కడి అధ్యాపకులతో మాట్లాడగా కొందరు విద్యార్థులు బాలికలను చూసి అరుపులు, ఈలలు వేయడం వల్ల కొందరు మగపిల్లలను మందలించామన్నారు.

స్పౌజ్ తప్పిదాలపై చర్యలకు సిద్ధం

- వేతనంలో ఇంక్రిమెంట్ కట్ చేసేలా ఉత్తర్వులు ?

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 2 : గతేడాది స్పౌజ్ కేటగిరిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల తప్పిదాలు చేసి నిబంధనలకు విరుద్ధంగా ప్లేస్‌లు తీసుకున్న ఏడుగురు ప్రధానోపాధ్యాయులపై చర్యలకు రంగం సిద్ధమైందని విశ్వసనీయ సమాచారం. 'ఆంధ్రజ్యోతి' గత సెప్టెంబరు నుంచి వస్తున్న వరుస కథనాల ఆధారంగా జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి పూర్తి నివేదిక తీసుకున్న ఆర్జేడీ విజయలక్ష్మి డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు పంపారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా మహబూబ్‌నగర్ జిల్లాలో స్పౌజ్ విషయంలో తప్పుడు సమాచారం ఇచ్చి విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా ప్లేస్‌లు తీసుకున్న జీహెచ్‌ఎంలకు వేతనంలో ఒక ఇంక్రిమెంట్ కట్ చేసేలా ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఓ ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు రెండు మూడు రోజుల్లో రానున్నట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు జీహెచ్‌ఎంలు ఓ సంఘం నాయకుడి వద్దకు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఈ విషయమై డీఈవో ఎ.రవీందర్ 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా మాకు ఇంకా ఎలాంటి ఉత్తర్వులు రాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

మూసాపేట, ఆగస్టు 2 : మండల పరిధిలోని 44వ జాతీయ రహదారిపై జానంపేట శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మోటార్ సైకిలిస్టులకు తీవ్ర గాయాలైనట్లు మూసాపేట పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... ఇదే మండలంలోని చక్రాపూర్ గ్రామానికి చెందిన అశోక్‌కుమార్ ద్విచక్ర వాహనంపై భూత్పూర్ నుంచి చక్రాపూర్‌కు వస్తుండగా కర్నూల్ పట్టణానికి చెందిన ఇమ్రాన్ దంపతులు మోటార్ సైకిల్‌పై హైదరాబాద్ నుంచి కర్నూల్‌కు వేగంతో వెళ్తూ ముందు వెళ్తున్న మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో చక్కాపూర్ అశోక్‌కుమార్, కర్నూల్ ఇమ్రాన్‌లకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. వారిని ఎల్‌అండ్‌టీ అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 58 మంది చేరదీత


ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం జిల్లాలో నెలరోజుల పాటు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా బాలకార్మికులుగా బడిబయట పనిచేస్తున్న 58 మంది బాలలను చేరదీశామని ఎస్పీ జానకి అన్నారు. జూలై మాసంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో లేబర్, ఉమెన్‌అండ్ చైల్డ్ వెల్ఫేర్, ఎన్జీఓస్‌తో కలిసి జిల్లా లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. తప్పిపోయిన బాలలతో పాటు బాలకార్మికులు, మానవ అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తించి చేరదీశామని పేర్కొన్నారు. ప్రత్యేక బృందాలతో చేసిన ఈ తనిఖీలో బాలకార్మికులను చేరదీయడం ఆనందంగా ఉందన్నారు. సంతోషంగా విద్యార్థులతో కలిసి ఆడుతూ, పాడుతూ చదుకోవాల్సిన చిన్నారులు ఇలా బడిబయట కార్మికులుగా పని చేయ డం బాధాకరమన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకునే యజమా నులపై చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. రిస్క్ చేసిన బాలలకు పునరావాసం, విద్యను కల్పించేందుకు కృషి చేస్తామని, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముస్కాన్ బృందాలను ఎస్పీ అభినందించారు.

'నకిలీ ఎరువుల తయారీదారులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలి'

బాలానగర్, ఆగస్టు 2 : మండలంలోని గౌతాపూర్ శివారులో విజయ ఆగ్రో టెక్ పరిశ్రమలో నకిలీ ఎరువులు తయారు చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో అధికారులు సుమోటోగా స్వీకరించి పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలీసులు సమగ్ర విచారణ జరపాలని కోరారు.

మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బాలానగర్, ఆగస్టు 2 : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 12769 గ్రామ పంచాయతీలలో పెండింగ్‌లో ఉన్న తాజా మాజీ సర్పంచ్‌ల బిల్లులు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు తిరుపతినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8నెలలు అయినా సర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించడం లేదని అన్నారు.

ఐదు రోజులపాటు స్వచ్ఛతపై అవగాహన

- పురపాలికలో 'స్వచ్ఛదనము..పచ్ఛదనము'కు యాక్షన్‌ప్లాన్

- వార్డు ఆఫీసర్ల సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్


మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్, ఆగస్టు 2 : పాలమూరు పురపాలికలో ఐదురోజుల పాటు స్వచ్ఛదనము-పచ్ఛదనము కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్ అన్నారు. ఇందుకోసం యాక్షన్ ప్లాన్ రూపొందిస్తున్నామని, ఈనెల 5నుంచి 9 వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని వార్డులలో అమలు చేయనున్నామన్నారు. శుక్రవారం పురపాలిక సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వార్డు ఆఫీసర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లో స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను మునిసిపల్ సిబ్బంది సేకరిస్తున్నందున చెత్తను ఇంట్లోనే తడి, పొడి వేరు చేయాలని, అలాగే వీధులు, మురుగుకాలువల్లో చెత్తవేయకుండా ప్రజలకు వివరించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై కలిగే అనర్థాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. కుక్కల నివారణపై చేపట్టే చర్యలపై ప్రజలకు వివరించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలు కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలని డెంగీ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. ఈనెల 5 నుంచి వార్డు ఆఫీసర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజలను జాగ్రతం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ పవన్‌కుమార్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

జడ్చర్ల, ఆగస్టు 2 : ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించాల్సిన స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జడ్చర్ల ఎంపీడీఓ విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. జడ్చర్ల మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశ వర్కర్‌లు, ఈజీఎస్ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు వారీగా ప్రభుత్వం సూచించిన మేర కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీవో సరోజ, పీఆర్ ఏఈ జవహర్‌బాబు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

మూసాపేట, ఆగస్టు 2 : ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆయా గ్రామాల్లో ప్రజలకు స్వచ్ఛదనం- పచ్ఛదనంపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని మండల అధికారులు తెలిపారు. శుక్రవారం మూసాపేట రైతు వేదికలో మండలంలో పని చేస్తున్న వివిధ శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎంపీవో అనురాధ, పీఆర్ ఏఈ లక్ష్మణ్‌గౌడ్, ఆయా గ్రామాల కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంఘాల సీసీలు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ భాగస్వాములు కావాలి

హన్వాడ, ఆగస్టు 2 : స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని మండల ప్రత్యేక అధికారి, డ్వామా పీడీ నర్సింములు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ నెల 5నుంచి 9 వరకు గ్రామాల్లో మొక్కలు నాటడం, పరిశుభ్రత కార్యక్రమాలు చేయాలని చెప్పారు. అధికారులు, గ్రామ స్థాయి అందరినీ భాగస్వాములు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో యశోద, తహసీల్దార్ కిష్యానాయక్, ఎంపీవో వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమన్వయంతో విజయవంతం చేయాలి

కోయిలకొండ, ఆగస్టు 2 : మండలంలో అధికారులు అందరూ సమన్వయంతో స్వచ్ఛదనం- పచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మధుసూదన్‌గౌడ్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీరామకొండ రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఎంపీడీవో కాళప్ప, ఎంపీవో నసీర్‌అహ్మద్, ఏఓ రామ్‌పాల్, ఏపీఎంవిజయకుమారి, ఏఈలు పరశురాం, అబ్దుల్‌బారి, ఏపీఓ నర్సయ్యతో పాటు అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌తో పాటు ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై రైతులతో ఎస్ఈ ముఖాముఖి

పాలమూరు, ఆగస్టు 2 : రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను తెలుసుకునేందుకు శుక్రవారం ఎస్.ఈ పి.వి రమేష్ ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. మాచన్‌పల్లి రైతువేదికలో రైతులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్లు, ఏబీ స్విచ్‌లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్, ఇంటర్మీడియెట్ పోల్స్, పాడైన పోల్స్‌ను సరిచేయాలని విద్యుత్ అధికారులను కోరారు. తొందరలోనే నిధులు తెప్పించి అవసరమైన చోట తప్పకుండా ఏర్పాటు చేస్తామని అధికారులు వివరించారు. ఎస్.ఈ పరిధిలోని పనులు తక్షణమే పూర్తి చేస్తామన్నారు. ఈ ఏరియాకు మంజూరైన సబ్‌స్టేషన్ తొందరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఏడీ, డీఈ, ఏఈ, మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మణికొండ, మాచన్‌పల్లి, రామచంద్రాపురం రైతులు పాల్గొన్నారు.


మాచన్‌పల్లి రైతువేదికలో మాట్లాడుతున్న ఎస్.ఈ పి.వి రమేష్

'స్వచ్ఛదనం-పచ్ఛదనం'విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), ఆగస్టు 2 : జిల్లాలో ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. కార్యక్రమాన్ని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, వార్డు కమిటీలు, ప్రజాప్రతి నిధుల భాగస్వామ్యంతో నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మంది రంలో స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమ నిర్వహణపై ఎంపీడీవోలు, ఎంపీవోలు, మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల అధికారులకు అవగాహన సమావేశం నిర్వహించి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. 5వ తేదీకి ముందుగానే స్వచ్ఛదనం పచ్ఛదనం కార్యక్రమం ఉద్దేశాన్ని, కార్యక్రమ వివరాలు తెలియజేసేలా ప్రభుత్వ కార్యాలయాల ప్రహరీ గోడలపై పేయింటింగ్ చేయించాలని సూచించారు. ఈ నెల 5న స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమం ప్రాంభించాలని, స్థానిక నాయకులు, మహిళాస్వయం సహాయక సభ్యులు, యువత, వార్డు కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేసి ర్యాలీ నిర్వహించాలని అన్నారు. వీధి కుక్కల బెడద, ఇంటి నుండి తడి, పొడి చెత్త వేరు చేయుట గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. శ్రమదానం ద్వారా జంగిల్ క్లియరెన్స్ చేయాలన్నారు. ఆరు నుంచి 9వ తేదీ వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలను కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డిఓ నర్సింహులు, ఇంచార్జీ డిపిఓ రాంరెడ్డి, డిఎఫ్ఓ సత్యనారాయణ, డిఎంహెచ్ఓ డాక్టర్ పద్మా, ఇతర అధికారుల పాల్గొన్నారు.

'వయనాడు బాధితులకు' అండగా ఉందాం

పాలమూరు, ఆగస్టు 2 : కేరళ రాష్ట్రం, వయనాడు వరద బాధితులను ఆదుకుందామని సీపీయం జిల్లా కార్యదర్శి ఏ.రాములు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పలువురు వైద్యులు, ప్రజలను కలిసి వరద బాధితులకు సహకారం అందించాలని కోరారు. కేరళలో భారీ వర్షాలు, ఆకస్మిక వర్షాలతో కొండ చర్యలు విరిగిపడి సుమారు 300మంది వరకు మరణించారన్నారు. భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంబవించిందన్నారు. శుక్రవారం సీపీయం ఆధ్వర్యంలో రూ.24,000లు విరాళాలు సేకరించినట్లు తెలిపారు. పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ రూ.2500 విరాళం అందజేసి ఉదారం చాటుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నల్లవెల్లి కురుమూర్తి, కిల్లె గోపాల్, చంద్రకాంత్‌లు పాల్గొన్నారు. శనివారం, ఆదివారం జిల్లా అంతటా సీపీయం శ్రేణులు ప్రజలకు దగ్గరకు వెళ్లి విరాళాలు సేకరించాలని పిలపునిచ్చారు.

ప్రతీ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

దేవరకద్ర, ఆగస్టు 2 : మండలంలోని ఉన్న ప్రతీగ్రామాన్ని పచ్ఛదనం పరిశుభ్రంగా ఉంచలని ఎంపీడీవో శ్రీనివాస్‌రావు పంచాయతీ కార్యదర్శులకు వివిధ శాఖల అధికారులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు నుంచి తొమ్మిదో తేదీ వరకు గ్రామాల్లో పచ్ఛదనం పరిశుభ్రత కార్యక్రమం ఉందని, కనుక ప్రతీ ఒక్కరు గ్రామాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు ఈఓ సీత్యానాయక్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్

జడ్చర్ల, ఆగస్టు 2 : జడ్చర్ల మండలంలోని మాజీ సర్పంచ్‌లను శుక్రవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పెండింగ్ బిల్లుల సాధన కోసం సర్పంచ్‌ల సంఘం పిలుపుమేరకు ఛలో హైదరాబాద్ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాల్గొనకుండా ఉండేలా వారిని ముందస్తుగా అరెస్ట్ చేసి, జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం స్వంత పూచీకత్తుపై మాజీ సర్పంచ్‌లను జడ్చర్ల పోలీసులు వదిలిపెట్టారు.

పాఠశాలల్లో పోటీలు నిర్వహించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం - పచ్ఛదనం, న్యూట్రీ గార్డెన్‌ను విస్తృతంగా ప్రచారం చేయడానికి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులను భాగస్వాములను చేసేందుకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న జిల్లా లోని అన్ని పాఠశాలల్లో పాఠశాల స్థాయిలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, నిర్వహించాలని తెలిపారు. 7న మండల స్థాయిలో పోటీలు, 8న జిల్లా స్థాయిలో ఈ పోటీలు నిర్వహించాలని తెలిపారు. ఈ పోటీలలో 6, 7, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహించాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబర్చిన వారిని మండల స్థాయికి, మండల స్థాయిలో కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపాలని తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి పాఠశాలలోని తెలుగు, జీవశాస్త్రం ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించి విజయవంతం చేయాలన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

రాజాపూర్, ఆగస్టు 2 : మండల పరిధిలోని అగ్రహారం పొట్లపల్లి గ్రామానికి చెందిన మంగళి జయంతి (45), రాజాపూర్‌కు చెందిన మహ్మద్ సుజాత్ ఆలీ (60), కల్లేపల్లి గ్రామానికి చెందిన కల్వకోలు కిష్టమ్మ (85)లు అనారోగ్యంతో మృతిచెందారు. మృతుల అంత్యక్రియలకు దొండ్లపల్లి ఎంపీటీసీ మాజీ సభ్యుడు రూ.5000 చొప్పున రూ.15000 సమకూర్చడంతో అభిమన్యు యువసేన సభ్యులు, నాయకులు, ఆ డబ్బులను మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై నాయకుల హర్షం


ప్రధాని మోదీ, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రాజాపూర్, ఆగస్టు 2 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఎమ్మార్పీఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకుల ఆధ్వర్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటాలకు వేర్వేరుగా క్షీరాభిషేకాలు చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమైనదని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామకృష్ణ, అశోక్, నర్సింములు, ఆనంద్, ఆదిత్య, మాజీ ఎంపీపీ నర్సింములు, యాదయ్య కృష్ణయ్య, రమేష్ రెడ్డి, గోవర్దన్ రెడ్డి,రమణ,రాజు, శేఖర్ గౌడ్, రాఘవేందర్, బుగ్గయ్య, అంజనే యులు, శ్రీను నాయక్, దనయ్య, శివకుమార్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● దేవరకద్ర : ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలి ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబ, మండల అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

● భూత్పూర్ : దళిత సంఘాల నాయకులు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి సంబురాలు జరుపుకున్నారు. ఎట్టకేలకు ఎస్సీ వర్గీకరణను సాధించుకున్నామని ఎమ్మార్పీఎస్ నాయకులు బాలయ్య, బాలరాజు, మ్యాతరి రాము తదితరులు అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీకి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని అన్నారు. సత్తయ్యగౌడ్, హరినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

చిన్నారులకు కంటివైద్య శిబిరం

మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, ఆగస్టు 2 : పాఠశాలల్లో చదివే చిన్నారులకు కంటి వైద్య శిబిరం నిర్వహించి అవసరమైన వారికి కంటిఅద్దాలు పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్, ఏనుగొండ రాంరెడ్డి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఏనుగొండ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉచిత ఐ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా 180 మంది చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలమూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వై.బాలరాజు, గిరి ప్రసాద్, విజయ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

- ధర్నాలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు

చిన్నచింతకుంట, ఆగస్టు 2 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. దీనికి మండల కార్యదర్శి దేవదానం అధ్యక్షత వహించిగా, ముఖ్య అతిథిగా జిల్లా కార్యవర్గసభ్యులు సాంబశివుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వంద రోజుల్లో 6 గ్యారెంటీలను అమలు చేస్తామని ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే వాటిని అమలుచేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు జాబు క్యాలెండర్ వంటివి అమలు చేయాలని తెలిపారు. ఆసరా, బీడీ కార్మికులకు జీవనభృతి, ఆటో డ్రైవర్లకు పింఛన్ వంటి పథకాలు అమలు చేయాలని తెలిపారు. అనంతరం తహసీల్దార్ కృష్ణయ్యకు వినతి త్రపం అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు చంద్రన్న, బీడీ కార్మిక సంఘం నాయకులు కొండన్న, రాజు, నర్సిహులు, ఆడివన్న పాల్గొన్నారు.

ఆచార్య ప్రఫుల్లా చంద్రరాయ్ సేవలు మరువలేనివి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, ఆగస్టు 2 : రసాయన శాస్త్రం అభివృద్ధికి కృషి చేసి ఆచార్య ప్రఫుల్లా చంద్రరాయ్ చేసిన సేవలు మరువలేనివని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రఫుల్లా చంద్రరాయ్ జయంత్యుత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పులమాల వేసి నివాళ్ళు అర్పించారు. రసాయన శాస్త్ర అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువ లేనివన్నారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగదిపతి అనిత, అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, హరిబాబు, కాళమ్మ, మార్కండేయ, ప్రవీణ్‌కుమార్, రాజేశ్వరి, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సర్వే చేయరు ... హద్దులు చూపరు

● భూ సర్వే కోసం రైతులు పడిగాపులు

● పదినెలలు అయినా సర్వే చేయని వైనం

● టీపన్స్ సరిగా లేకే ఆలస్యం : ల్యాండ్ సర్వే ఏడీ



మహమ్మదాబాద్, ఆగస్టు 2 : భూముల సర్వే కోసం రైతులు చలానాలు చెల్లించి నెలలు గడుస్తున్నా అధికారులు మాత్రం సర్వేలు చేయడం లేదు. సర్వే అధికారులు అప్పుడు, ఇప్పుడు అంటూ రైతులకు గడువులు చెపుతు కాలయాపన చేస్తున్నారు తప్ప భూసర్వే చేయడం లేదు. రైతుల మధ్య ఉన్న భూ తగాదాలు తీర్చడంలేదు. సర్వేల కోసం అన్నదాతలు ఏళ్లుగా పడిగాపులు కాస్తున్నారు. పలుమార్లు ప్రజావాణిలో సర్వేలు పూర్తి చేయాలని ఫిర్యాదులు చేస్తున్నా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. ఏదో ఒక చోట సర్వేచేసినా అందుకు సంబంధించిన సర్వే రిపోర్టుకోసం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఇవ్వడంలేదు. సర్వేల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులకు చెందిన వందల సంఖ్యలో సర్వే దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. భూసర్వే చలానా కట్టిన 41 రోజుల లోపు సర్వేకు దరఖాస్తు చేసుకున్న రైతు పొలం చుట్టు పక్కల రైతులకు సర్వే చేస్తున్నాం, ఆ సమయంలో ఆ రైతులు హాజరుకావాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వాలి. సర్వేకు సంబంధించి వలాన తేదీన కొలతలు చేస్తామని, అందరు అందుబాటులో ఉండాలని సూచిస్తారు. కానీ, కొందరు సర్వేయర్లు సర్వేతేదీ ఇచ్చి ఈ రోజు వీలు కావడం లేదని, మరో రోజు వస్తాం అని చెపుతూ కాలయాపన చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో హద్దుల విషయమై రైతులు ఒకరినొకరు దాడులకు పాల్పడుతున్నారు.

టీపన్స్ లేకపోవడం వల్లే ఆలస్యం

సర్వేకోసం జిల్లాలోని అన్ని మండలాల్లో కొంత ఇబ్బంది కర సరిస్థితి ఉంది. టీపన్స్ లేక పూర్తిగా ఆగిపోయిన పరిస్థితి. దీంతో ఇబ్బందికరంగా ఉంది. సర్వేయర్లు కూడా కొందరు సెలవులో ఉన్నారు. ఉన్నచోట ఎప్పటికప్పుడు చేస్తున్న రిపోర్టు కూడా ఇస్తున్నాం.

- కిషన్‌రావు, ఏడీ, ల్యాండ్ సర్వే శాఖ, మహబూబ్‌నగర్

పలుకుబడి, పైరవీ చేసేవారికే అందలం

ముందుగా సర్వే కోసం ఎవరైతే చలానాలు చెల్లించి దరఖాస్తు చేసు కున్నారో వారి సీరియల్ నెంబర్ ప్రకారం సర్వే చేయాలి. కానీ, అధికా రులు మరోలా వ్యవహరిస్తున్నారు. పలుకుబడి ఉన్నవారి భూ సర్వే పెట్టుకుంటే వారికే ముందుగా సర్వే చేస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వస్తున్నాయి. సర్వే చేసినా అందుకు సంబంధించిన రిపోర్టు సర్వే పూర్తి అయినా మరు సటి రోజు ఇవ్వాలి. కానీ, నెలలు గడిచినా రిపో ర్టు ఇవ్వని పరిస్థితి ఉంది, అందుకు ఎన్నో కొర్రీలు పెడుతున్నారు. కొందరు రైతులైతే చలానాలు చెల్లించి పది పదకొండు నెలల కింద సర్వేకోసం పెట్టుకున్నా సర్వే చేయడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహమ్మబాద్ మం డల పరిధిలోని నంచర్ల గ్రామంలో ఉన్న ఓ సర్వే నెంబర్ కోసం సర్వే చేయాలని చలానా కట్టి సుమారు పది నెలలు కావస్తున్నా ఇప్పటికీ సర్వే చేయలేదు. నవాబ్‌పేట మండల పరిధిలోని ఇప్పటూరులో సర్వే 327లో సర్వే కోసమని చలానా కట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ సర్వే చేయలేదు. అప్పుడు ఇప్పుడు అంటూ చెబుతున్నారని రైతులు అంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక మంది రైతులు సర్వేల కోసమని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు.